# ప్రేమభిక్ష

తిమ్మరాజు సత్యనారాయణ రావుగారు (శ్రీసోదర సమితి)

ఆమె ఆనందముతో స్వేచ్ఛాగానముచేస్తూ కొండమీద ఒక చక్కని రాతిపలకపై కూర్చుంది. ఆమె చుట్టూ తేజస్సు నాట్యం చేస్తూంది. ఆనందతరంగాలు ఆమెనుండి తేలి వచ్చి చుట్టూ వెదజల్లబడుతున్నాయి. ఆమె కనులలోనుండి మధురమైన శాంతి ప్రవాహం ప్రవహిస్తూంది. హాహా! ఏమి దివ్యమూర్తి?

కష్టపడి కొండంతా ఎక్కాను. ఆమెకు కొంత దూరాన్న క్రింద నిలబడి సగర్వంగా చూస్తూ చేయిచాచి

"ఓమధురమూర్తీ! ఆనందమయీ!

నేను కవి కుమారుణ్ణి. నా మధురగీతాలతో ప్రపంచమంతా నింపివేస్తాను. విశ్వమంతా నాగీతాలు విని పులకించి ఆనందిస్తుంది. ఏశాస్త్రజ్ఞుడికీ వీలుకాని విశ్వరహస్యాలలోకి చొచ్చుకొనిపోయి వాటిని ప్రపంచానికి విస్పష్టంగా చాటగలను నేను..............."

"అయితే ఏమంటావు?" అంది కొంచెం నిర్లక్ష్యంతో.

"నాకు ప్రేమభిక్ష కావాలి."

"అల్లాగా" అన్నట్లుగా కనుబొమలు పైకెత్తి తిరస్కారపూర్వకంగా చిరునవ్వునవ్వింది.

ఏమిటిది? నేనువచ్చి అడగడమూ ఈమె ఏమిటో తిరస్కారంగా తీసిపారవేయడమునా? ఇంత అహంకారమా? కనుబొమలు ముడివేసి కొంచెం చిన్నదనంతో ఆమెవైపు చూశాను. ఆమె తిరిగి కొంచెం గట్టిగా నవ్వింది.

"ఏమన్నావు? కవికుమారుడవా? పాటలు పాడుతావా? ఏం పాటలు? ఎందుకు? ఎవరికోసం?"

"నాకోసం—ప్రపంచంకోసం."

"ప్రపంచానికీ నీ పాటలకీ సంబంధము ఏమిటి? ఎల్లా పనికొస్తాయి నీ పాటలు ప్రపంచానికి?"

"ప్రపంచం అవి విని ఆనందిస్తుంది. ప్రపంచంతోపాటు నేనూ ఆనందిస్తాను."

"నీఆనందం సంగతి నా కక్కరలేదు. నీ పాటలు నీకోసమే అయితే వాటికీ నాకూ సంబంధము ఏమిటి?"

"నాకోసమేకాదు? ప్రపంచం కోసమని చెబుతున్నానుగా?"

"ప్రపంచంకోసమా" తిరిగి ఆ తిరస్కారపు నవ్వు.

"ప్రపంచాన్ని సరిగ్గా చూసి పాడుతున్నావు నువ్వు? నీకు ప్రపంచం అంటే ఏమిటో తెలుసునా?"

ఏమిటీ? చిన్నపిల్లలని అడిగినట్టు—
"ప్రపంచం అంటే ఏమిటి?—"

"ఫలపుష్పతరుభరితమైన సుందర వసుంధర—

ప్రేమ గాన తత్పరమైన విశాల నీలసాగరము—

సౌందర్యాకరములైన పర్వతాలు—

విశాలాకాశము, చక్కనిమబ్బులు, చల్లనివెన్నెలలు, మధుర సువాసనలు—"

"చాలు—ఇదా నీప్రపంచం? నీ ప్రపంచానికి జీవకోటితో ఏమీ సంబంధములేదు కాబోలు?"

"లేకపోవడమేమి? నన్ను పూర్తిగా చెప్పనియ్యక—"

"నీకూ మానవకోటికీ సంబంధము ఏమిటో చెప్పు?"

"నేను మానవస్వభావాన్ని శ్రద్ధతో పరిశీలించాను. ప్రేమనుగురించి, ప్రణయాన్నిగురించి, విషాదాన్నిగురించి చక్కని పాటలు పాడాను."

"మహాగొప్ప పనిచేశావు."

"నీపాటలు మానవకోటికి ఎందుకు?"

"ఆనందించడానికి."

"అల్లాగా! అయితే అల్లాచూడు."

చూశాను: ఒకపొలముగట్టున ఇరువురు పేద దంపతులూ, ఇరువురు పిల్లలూ కూర్చున్నారు. ఒక చిన్నగిన్నెలో కాస్త అన్నం ఆ పిల్లలిరువురూ తింటున్నారు. పెద్దవాళ్లు వాళ్లకేసి సౌమ్యదృష్టులతో చూస్తున్నారు.

"చూశావా?"

ఆ! గ్రామ్యజీవనాన్ని, దాని సౌందర్యాన్ని, గురించి నే నెన్నో పాటలు వ్రాశా—"

"చాలు నీపాటలు నువ్వూను—ఆదృశ్యంలో నీకు సౌందర్యం ఏమి కనబడుతోంది? ఆ హృదయాలలో మండిపోతున్న దారిద్ర్యాగ్ని చూడు! ఆముఖాలలో ప్రకాశిస్తోన్న దుఃఖము చూడు; కృశించిపోయిన ఆశరీరాలు, వాడిపోయిన ముఖాలు—కవివి కాదూ? కనపడడం లేదూ? వెళ్లు! అక్కడ పాడు నీపాటలు; వాళ్లకు ఆనందం కలుగజేయి. తిరస్కారపూరితమైన సంఘముయొక్క బరువంతా ఆ పేద జీవులలో కనిపించడం లేదూ? నీకు ప్రేమభిక్షు కావాలీ? నాకు ఆనందం కలగడానికి ఏమి చేశావు నువ్వు? మలమల మాడిపోయే ఆ పేదలమాట ఏమి ఆలోచించావు?"

"ఏమీ లేదు."

"ఇంక నీకు ప్రేమభిక్ష ఏలా వస్తుంది?"

తెల్లబోయి చూశాను; తలవంచుకొన్నాను.

"చూడు! నీకు నేనంటే గౌరవం ప్రేమా ఉన్నది కాదూ?

"ఓ! నూవు ఏంచేయమంటే అది చేస్తాను. ఉన్నట్లుగా ప్రాణాలు యిచ్చేయమంటే యిచ్చేస్తాను."

"చాలా గొప్పవిషయమే. నీ ప్రాణాలు యిచ్చేస్తావా? ఏంచేసుకుంటాను అవి? నీ జీవితంలో చేసేది ఏమైనా ప్రపంచకానికి కావాలి గాని, నీవుబ్రతికితె ఎవరికి, చనిపోతే ఎవరికి?

ఇంకోటి అడుగుతాను. నామీద ప్రేమా, గౌరవము ఉంటే, నాజాతికోసం ఏం చేశావు నువ్వు? నిరంతరదాస్యం, దుఃఖము, ఇచ్చావా? తిరిగి తలయెత్తకుండా శాసించేశావా? అల్లాచూడు! ఆ జన్మాంతమూ వైధవ్యము అనుభవిస్తూ బాధఅంతా కన్నులవెంబడి నీటి బిందువులుగా రాలుస్తున్న ఆబాలికకోసం నీవు ఏమిచేశావు? అజ్ఞానంలోనుంచి పైకి రావడానికి ప్రయత్నిస్తుంటే, దాస్యంలో నుంచి స్వేచ్ఛ, స్వాతంత్ర్యమూ తెచ్చుకుంటుంటే ఏమిసహాయం చేశావు? పెద్దగొంతుపెట్టుకుని గోలచేస్తూ అడ్డంవచ్చావు. భాషపేరు చెప్పి, నా గౌరవానికి భంగమైన నీతిలేని వ్రాతలన్నీ వ్రాశావు?"

"నేనా?"

"నువ్వా అంటే నువ్వే. నీవు వీటి నన్నిటిని ప్రతిఘటించి, నిర్మూలముచేసేదాకా వాటితో సానుభూతి చూపిస్తున్నా వన్నమాటే."

"ఛా! నా సానుభూతి దుర్మార్గంతో ఎంతమాత్రం లేదు."

"లేకపోతే ఏమిచేశావు.?"

"ఏమీ చేయ్యనిమాట నిజమే."

"ఇక నీకు ప్రేమభిక్ష ఎల్లావస్తుంది?"

తిరిగి తలవంచుకొన్నాను.

"చూడు! మఱి నీకు నేను ప్రణయినిని కావాలి కాదూ? నన్ను నీవు ప్రేమపుష్పాలతో ఆరాధించాలి కాదూ? మఱి నాకు ఆలయ మేదీ?"

"ఇదిగో! నా హృదయం."

"నీహృదయమా? మహా చక్కని ఆలయమే! చూడు, ఎంతమలినంగాఉందో! ఎంత కల్మషమో దానినిండా! ఎల్లాఉండగలను నేను అక్కడ? అక్కడ అంతా దాస్యభావమే. ఏమాత్రం స్వతంత్రవాతావరణం లేదు. నాకు అదా ఆలయం?"

ఇంకేముంది? హతాశుణ్ణి. గర్వమంతా పోయింది. నాపాటలన్నీ మఱిచి పోవడానికి నిశ్చయించుకొన్నాను! ఇంక ఈప్రపంచంలో స్థానంఏదీ? దీనినివదలి వేయడమే గతి.నిరాశుడనై లేచాను.

"ఇలారా!"

వణకుతూ, కంపించిపోతూ, నెమ్మదిగా వెళ్లి దగ్గరగా నిలబడ్డాను. శక్తిలేక వణుకుతూ ఆమె పాదాలుమీద పడ్డాను. అప్రయత్నంగానే అశ్రుబిందువులు రాలి ఆమెపాదాలమీద పడినవి.

ఆమె నాతల ఎత్తింది.

"ఏమిటిది? నిరాశ? నీహృదయంలో ఏముందో నాకుతెలుసు. నిరాశుడవై లాభం ఏముంది? నీలో ప్రజ్వలిస్తున్న జ్యోతిలేదూ? యువకుడవు కాదూ? నీలోని యువకత్వం అంతా ఏమయి పోయింది? నడుముకట్టు-ప్రయత్నించు-నాప్రేమ ఎల్లప్పుడూఉంది. నిజమైన యువకుడవయితే, నాప్రేమకోసం నీవు అర్థించనక్కరలేదు. నీదగ్గరకే రెక్కలు కట్టుకు వచ్చి వ్రాలుతాను."

ఏమిదయ! ఏమిశాంతం! ఏమిప్రేమ! ధైర్యంవచ్చింది.

నేను యువకుడను కానూ?......

---